పాడేరులో భారీ వర్షం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భగభగలాడిన ఎండ, తర్వాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చి, మబ్బులు కమ్ముకుని, మధ్యాహ్నం 3 గంటల తర్వాత భారీ వర్షం కురిసింది. గంటసేపు కురిసిన వర్షానికి పాడేరు పట్టణంలో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. భారీ వర్షానికి పట్టణంలోని రోడ్లు వీధులు జలమయమయ్యాయి. చిరు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు.

పాడేరు సెంటర్ సి జంక్షన్ లో కురుస్తున్న వర్షం

సమస్యల పరిష్కారానికి హామీ

గెమ్మలిలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -జి.మాడుగుల : మండలంలోని గెమ్మెలి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా ఉదయం 10.15 గంటలకు మద్దులబంద మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి, విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న రేకుల షెడ్ పాఠశాల నిర్వహణ, విద్యాబోధనను పరిశీలించి, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాల భవనం నిర్మాణానికి తక్షణ చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామంలో సందర్శించి రైతులు, ప్రజలతో మాట్లాడారు. గిరిజనుల పంటలు, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సదుపాయం కల్పనకు చర్యలు తీసుకుంటానని భరోసానిచ్చారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను స్థానికులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అంగన్వాడీ భవనం, తాగునీరు, గృహ నిర్మాణాలపై చర్చించి, ఆయా సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఓ అప్పలస్వామి, సర్పంచ్, పాఠశాల ఉపాధ్యాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నిలువెత్తు నిర్లక్ష్యం

నత్తనడక నిర్మాణంతో ప్రజల అగచాట్లు
అధికారుల పర్యవేక్షణ లోపంతో అవస్థలు

మెటల్ సర్ది వదిలేసిన కంగారుపుట్టు రోడ్డు

ప్రజాశక్తి -హుకుంపేట: జిల్లా కేంద్రానికి కొద్దిదూరంలోనే రహదారి నిర్మాణ పనుల్లో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం విమర్శలకు తావిస్తోంది. గిరిజనానికి నానా అగచాట్లకు గురిచేస్తోంది. అడపాదడపా ప్రమాదాలు జరుగుతున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న వైనంపై మన్యవాసులు మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళితే...

మండలంలోని ములియపుట్టు పంచాయతీ కుల్లుపాడు జంక్షన్ నుంచి కంగారుపుట్టు వరకు మూడు కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్ట్ పొందిన సంబంధిత గుత్తేదారు వెంటనే రహదారిలో మెటల్ వేయడం, వాటిని రోడ్డు పొడుగునా సర్దడంతో తమ రవాణా కష్టాలు తీరిపోతాయని గిరిజనులు ఎంతో సంబరపడ్డారు. అయితే అక్కడి నుంచి పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పొడుగునా పరిచేసిన మెటల్‌ను రోలింగ్ చేయడంగానీ, దానిపై కంకర,ఇంకా ఏదైనా స్టోన్‌యాష్ వేసి చదును చేయడం, వాటరింగ్ చేయడం వంటి పనులు మచ్చుకైనా చేపట్టలేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా పనులు చేస్తున్నా, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు తమకు సంబంధం లేదనుకున్నారేమోగానీ కనీసం పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు.

ఫలితంగా ఈ మార్గంలో బైక్‌లు, ఇతర వాహనాలుగానీ, పాదచారులుగానీ రాకపోకలకు నానా ఇక్కట్లు పడే పరిస్థితి ఉంది. కాలినడకన వెళ్లే పాదచారులకు రాళ్లు గుచ్చుకోవడం, రాళ్లపై స్కిడ్ అవి పడిపోయి గాయాలపాలయ్యే ఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు అంటున్నారు. ఇక బైక్‌లైతే ఇంచీ అయినా ముందుకు కదలని పరిస్థితి, ఆటోలు, ఇతర వాహనాలు కూడా ఈ మార్గంలో వెళ్లలేనంత అధ్వానస్థితిలో రోడ్డును ఉంచేసి వదిలేశారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయిన చందాన, నూతన రోడ్డు నిర్మాణానికి వేసిన మెటల్‌తో ఇపుడు రాకపోకలకు కష్టమౌతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేసి, పూర్తి చేసేందుకు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

సరుకు రవాణాకు నేటికీ గుర్రాలే ఆధారం..!

మన్యంలో మారుమూల గ్రామాల ప్రజల రవాణా కష్టాలు

అంగన్‌వాడీ కేంద్రానికి సరుకులు మోసుకెళుతున్న గుర్రాలు

ప్రజాశక్తి -జి మాడుగుల : స్వాతంత్ర్యం సిద్ధించి ఏడున్నర దశాబ్దాలు గడచినా నేటికీ రోడ్డు,రవాణా సౌకర్యంలేని గ్రామాలెన్నో అల్లూరి మన్యంలో నేటికీ ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ప్రజలు నేటికీ సమాజానికి దూరంగా, కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. ప్రభుత్వపరంగా సంక్షేమ పథకాలు, ఇతర లబ్ధిని అందిపుచ్చుకోవాలన్నా వీరు పడే అగచాట్లు అన్నీ ఇన్నీ కాదు. అల్లూరి జిల్లా పాడేరు డివిజన్‌లోని జి.మాడుగుల మండలం బొయితిలి పంచాయతీ చింతగుప్ప గ్రామమే ఇందుకు నిదర్శనం. ప్రధాన రహదారికి దాదాపు 20కిలోమీటర్లు దూరంలో మన్యంలో ఉన్న ఈ గ్రామానికి అత్యవసరం, నిత్యవసమైనా వారు పడే అవస్థలు చెప్పనలవికాదు. చివరకు అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన పౌష్టికాహారం కూడా గ్రామాలకు చేరాలంటే మరో గత్యంతరం లేని పరిస్థితుల్లో నేటికీ గుర్రాల సాయం తీసుకుంటున్నారు. పూర్వం ఇలా ఉండేదని మనం కథల్లో చెప్పకునే అంశాలు, జానపద, పౌరాణిక చిత్రాల్లో కనిపించే దృశ్యాలు ఇక్కడ సజీవంగానే నేటికీ కనిపిస్తుండడం విశేషం. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం, అంగన్వాడీ సరుకులను స్థానిక మినీ అంగన్వాడీ కేంద్రం కార్యకర్త గుర్రం సాయంతో తీసుకెళుతూ కనిపిచింది. దీనిపై ఆమెను ప్రశ్నించగా, ప్రతినెలా ఇలాగే సరుకులు తీసుకెళ్లి అంగన్వాడీ లబ్ధిదారులకు అందజేస్తుంటామన్నారు. వర్షాకాంలో సరుకుల రవాణాకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. మరో గత్యంతరం లేని పరిస్థితుల్లో సరుకుల రవాణాకు గుర్రాల సాయాన్ని నేటికీ తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథా!

- దాహార్తితో అలమటిస్తున్న సాయినగర్ వీధి వాసులు
- ఐదు నెలలుగా వంద కుటుంబాలు నీటికి కటకట
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు

పైపులైన్ లీకేజీని చూపుతున్న స్థానికుడు

ప్రజాశక్తి -పాడేరు: ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం వల్ల ఐదు నెలలుగా తాగునీటికి అలమటిస్తున్నామని చింతపల్లి మండల కేంద్రంలోని సాయినగర్ వీధి వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. శాశ్వతంగా నీటి వృథాను అరికట్టడం విషయాన్ని పక్కన బెడితే, చిన్నపాటి మరమ్మతు చేపట్టినా శివారున ఉన్న వంద కుటుంబాలకు సాగునీరు అందే పరిస్థితి ఉన్నా, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మండల కేంద్రంలోనే పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఉంటే మారుమూల గ్రామాల పరిస్థితి ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల అలక్ష్యం కారణంగా చింతపల్లి మండల కేంద్రంలోని సాయినగర్ వీధి వాసులు ఐదు నెలలుగా తాగునీటికి కటకటలాడుతున్నారు. రక్షితనీటి పథకం ద్వారా సాయినగర్ మీదుగా దాదాపు 100 కుటుంబాలకు తాగునీటిని సరఫరా చేస్తున్న పైపులైను లీకేజీ కావడంతో కొన్నిచోట్ల పూర్తిగా చుక్కనీరు అందని పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్, మండల అధికారులకు పైపుల దుస్థితిని వివరించి మరమ్మతులు చేపట్టాలని పలుసార్లు విన్నవించినా కనీస స్పందన కరువైందని, ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పనులు చేపట్టిన సంబంధిత కాంట్రాక్టరుకు తెలియజేసినా తప్పించుకున్న ధోరణితో వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. దీంతో పైపులైన్ లీకేజీ కారణంగా నీటి పథకం నుంచి కనీసం మూడోవంతు నీటినైనా విడిచిపెట్టక పోవడంతో సాయినగర్ వాసులకు నీరు అందని స్థితి ఉంది. పైపులైన్‌ను లీకేజీని శాశ్వతంగా అరికట్టాల్సిన అధికారులు, కనీసం తాత్కాలికంగానైనా చేపట్టే వీలున్నా ఎందుకో స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇన్నాళ్లు ఎలాగో నెట్టుకొచ్చినా, రానున్నది వేసవి కాలం కావడంతో నీటి అవసరాలను పెరిగే దృష్ట్యా పైపులైన్ లీకేజీని శాశ్వత మరమ్మతులు చేపట్టి, పూర్తిస్థాయిలో నీరు అందించే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

21న ఆశాల ‘చలో ఐటిడిఎ’

డుంబ్రిగుడలో ఆశాలతో మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత సూర్యనారాయణ

ప్రజాశక్తి డుంబ్రిగుడ: పిహెచ్‌సిల పరిధిలో పనిచేస్తున్న ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ఈనెల 21న చేపట్టే చలో ఐటిడిఎ ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని కిల్లోగూడ పిహెచ్‌సిలో ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిహెచ్డబ్ల్యూలుగా ఉన్న వారిని ఆశ కార్యకర్తలుగా మార్చాలని, ఆశాలకు వేతన బకాయి వెంటనే చెల్లించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కరారు. ఈ నెల 21 చలో ఐటిడిఎ ముట్టడి ఆందోళనలో అధికసంఖ్యలో ఆశాలు పాల్గొని జయప్రదంచేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తల సంఘం నేత సన్నమ్మ పాల్గొన్నారు.

అల్లూరి జిల్లా: సిఐటియు జిల్లా కమిటీ పిలుపుమేరకు ఈనెల చలో ఐటిడిఎ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు ముంచంగిపుట్టు మండల కార్యదర్శి కొర్ర శంకరరావు పిలుపునిచ్చారు. మంగళవారం కిలగాడ పిహెచ్‌సిలో సిహెచ్‌డబ్ల్యులు, ఆశాలతో సమావేశం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వద్ద సిహెచ్డబ్ల్యు, ఆశ కార్యకర్తలతో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కమిటీ సభ్యులు పాంగి భీమన్న, కొర్ర డొంబు, ఆశ సిహెచ్‌డబ్ల్యులు పాల్గొన్నారు.

కిలగాడ పిహెచ్‌సి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా కార్యకర్తలు

‘విప్ప’తో ఎన్నో ప్రయోజనాలు

గిరిజనుల జీవితాల్లో అంతర్భాగం

విప్ప పూలను సేకరిస్తున్న గిరిజన మహిళ

విప్ప పూలను ఎండలో ఆరబెట్టిన దృశ్యం

ప్రజాశక్తి- చింతూరు

ఆదివాసీ అడవి బిడ్డల జీవితాల్లో విడదీయలేని అంతర్భాగమైనది విప్ప చెట్టు. అది ఎంతో విలువైనది. ఆదివాసీలకు ప్రకృతి ప్రసాదించిన కల్పవృక్షం. ఏజెన్సీలోని అడవుల్లో లభించే అనేక రకాల అటవీ ఫలసాయాల్లో విప్ప ఆదివాసీలకు ప్రత్యేకమైనది. ఆ చెట్టు ద్వారా ఆదివాసీలకు అనేక రకాల ఉపయోగాలు ఉన్నాయి. విప్ప కాయలు, విప్ప పూలు ఆదివాసీలకు ఆదాయ వనరులుగా మాత్రమే కాకుండా, వారి ఆచార వ్యవహారాల్లోనూ విప్ప చెట్టుకు ప్రాముఖ్యత ఉంది. ఆదివాసీలు విప్ప చెట్టు నుండి వచ్చే ఫలసాయాన్ని కలియుగ భీముని పంటగా పిలుస్తారు.

ఏజెన్సీ ప్రాంతంలో విప్ప చెట్లు విరివిగా ఉన్నాయి. ప్రకృతి ప్రసాదించిన వాటిలో మేటిగా విప్ప పలు విధాలుగా మానవ జీవితంతో ముడి పడిపోయింది. మార్చి నెల చివరి వారం నుండి ఏప్రిల్ మొదటి రెండు వారాల్లో గిరిజనులు భీమల్ పెయిన్ చెట్టు పండుగ సందర్భంగా విప్ప చెట్టుకు పూజ చేసిన తర్వాత విప్ప పూల సేకరణ ప్రారంభిస్తారు. స్వయంగా అల్లిన వెదురు బుట్టలోనూ, గంపల్లోనూ మాత్రమే పూలను సేకరిస్తారు. పోక్కలు అని కూడా ఈ ప్రాంత వాసులు పిలుస్తారు. కొమరం భీమ్ సిర్పూర్ లింగాపూర్ ఏజెన్సీ జిల్లాల్లో విప్ప చెట్టును తమ కులదైవంగా కొలుస్తారు.

విప్పతో ఎన్నో ఉపయోగాలు

విప్పకాయల నుండి సేకరించిన తప్పును స్థానిక గానుగల్లో ఆడించి ఇప్ప నూనె తీస్తారు. అలా తీసిన విప్ప నూనెను పిండి వంటల్లో వాడుతారు. విప్ప నూనెను పూజా కార్యక్రమాల్లో కూడా దీపారాధనకు ఉపయోగిస్తారు. నూనె తీయగా వచ్చిన పిప్పిను సబ్బుల తయారీలో వినియోగిస్తారు. 30 ఏళ్ల పైబడిన విప్పచెట్టు నుండి సుమారు 100 నుండి 150 కేజీల విప్పపువ్వు లభిస్తుంది. విప్ప పూలు బాలింతలకు ఎంతో ఉపయోగకరంగా ఆయుర్వేద వైద్య విధానం తెలుపుతుంది. పిల్లలు వీటిని నేరుగా తినటం వలన రక్తహీనత లోపం నుండి బయటపడతారు.

తీవ్రమైన ఉష్ణోగ్రత నుండి ఉపశమనం కోసం వేసవిలో ఆదివాసీలు అంబలి తాగుతారు. అందులో విప్ప ఫ్రై స్నాక్స్‌గా నంజుకుంటారు. విప్ప పప్పులను జొన్న పిండిలో కలిపి చేసే గారెలు అద్భుత రుచి కలిగి ఉంటాయి. పలు రకాల స్వీట్, హాట్ తయారీలో కూడా విప్ప పూల మిశ్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. గోధుమ పిండితో చేసే విప్ప లడ్డు రుచికరంగా ఉంటుంది. విప్ప కుడుములు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. రక్తహీనతతో బాధపడే వారికి విప్పపూల వంటకాలు ఎంతో దోహదపడతాయి. ప్రస్తుతం ఫుడ్ సేఫ్టీ సెక్యూరిటీ సర్టిఫికెట్ కోసం ఐటిడిఎ ప్రయత్నం చేస్తుంది.

గిరిజన సంప్రదాయాల్లో...

విప్ప పూలతో నాణ్యమైన సారా తయారు చేస్తారు. ఇది గిరిజన సంప్రదాయాల్లో అంతర్భాగంగా ఉంటుంది. వివాహ శుభకార్యాల్లోనూ, దినకర్మకాండ సందర్భంలోనూ ఇంటికి వచ్చిన అతిథులకు విప్ప సారాను మర్యాదపూర్వకంగా ఇస్తారు. విప్పపూల ఆవిరిని కలిపి సారాను తయారు చేస్తారు. ఇది ఎంతో శ్రేష్టమైనదని వైన్ షాపుల్లో అమ్ముడుపోయే మద్యం కన్నా ఎంతో నాణ్యతతో కూడినదిగా పేరుంది. ఎటువంటి రసాయనాలు, క్రిమిసంహారక మందులను వాడకుండా కేవలం విప్ప పూలను బెల్లం ఊటను కలిపి కుండలలో తయారు చేసే విప్ప సారాకు మంచి గిరాకీ కూడా ఉంది. స్వచ్ఛమైన విప్పసారా అనేక రకాల శారీరక రుగ్మతల నయం చేయడానికి ఎంతో దోహదపడుతుందని నానుడి ఉంది.

గోధుమ పిండి, విప్పతో లడ్డూలు చేస్తున్న మహిళలు

విప్పతో చేసిన హల్వా

ఎమ్మెల్యే ధనలక్ష్మిని ప్రశ్నిస్తున్న గిరిజన నాయకులు, గిరిజనులు

ఎమ్మెల్యే ధనలక్ష్మికి నిరసన సెగ

- గోబ్యాక్ అంటూ హోరెత్తిన నినాదాలు
- బోయ, వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడంపై రాజీనామా చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-కూనవరం

బోయ వాల్మికిలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని వైసిపి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడంపై ఎటువంటి అభ్యంతరం తెలపని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మికి గిరిజనుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతుంది. మంగళవారం మండలంలోని కోతులగుట్ట గ్రామంలో వైఎస్ఆర్ ఆసరా సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యే ధనలక్ష్మిని ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ఎమ్మెల్యే గో బ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జిఒ నెంబర్ 52ను రద్దు చేయాలని ఆదివాసీ జెఎసి, గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదిమకాలం నుండి ఎటువంటి గిరిజన ఆనవాళ్లు లేని కులాలను ఎలా ఎస్‌టి జాబితాలో కలుపుతారని ప్రశ్నిచారు. వేరే కులాలను ఎస్టీ జాబితాలో కలుపుతుంటే ఒక ఆదివాసీ ఆడపడుచు అయి ఉండి ప్రభుత్వానికి తమ గోడు చెప్పలేరా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా తీర్మానాన్ని రద్దు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, లేకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఆదివాసీల పోరాటానికి బాసటగా నిలవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది రవితేజ, గిరిజన సంఘం నాయకులు బాబు బొర్రయ్య, ఆదివాసీ జేఏసీ నాయకులు కుంజా అనిల్ కుమార్, పాయం సీతారామయ్య, తెల్లం తమ్మయ్య, కారం రవి, సర్పంచులు, ఎంపిటీసీలు పాల్గొన్నారు.

రోడ్డుపై బైఠాయించిన ఆదివాసీలు

శిథిలావస్థలో కల్వర్టు

- వరద వస్తే కొట్టుకుపోయే పరిస్థితి
- ఆందోళన చెందుతున్న పది గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి- కొయ్యూరు

పది గ్రామాల గిరిజనులకు ఉపయోగపడే రత్నంపేట -పాడి గ్రామాల మధ్య రహదారిపై ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరింది. వరద వస్తే ఇది కొట్టుకుపోయందుకు సిద్ధంగా ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చెందుతున్నారు. ఈ కల్వర్టు కూడా లేకపోతే వర్షా కాలంలో రాకపోకలు ఆగిపోతాయని వారు భయపడుతున్నారు.

అల్లూరి జిల్లా, కొయ్యూరు మండలం రత్నంపేట - కొండగొకిరి పంచాయతీ పరిధి పాడి గ్రామాల మధ్య తాండవ నదిలోకి కొండగెడ్డల నుండి నీరు వస్తుంది. ఈ గెడ్డ దాటితే తప్పా కొత్తపాడి, పాతపాడి, రత్నంపేట, కాపు రత్నం పేట, కన్నంపేట, అప్పిలి కొత్తూరుతో పాటు పది గ్రామాలకు రాకపోకలు సాగవు. ఈ నేపథ్యంలో ఈ గెడ్డపై 1989లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కల్వర్టు నిర్మాణం చేపట్టారు. అప్పటి ఐటిడిఎ పిఓ సోమేశ్ కుమార్ ఈ వంతెనతోపాటు, ఇక్కడ నుండి బాలారం, ఆడాకుల కొత్తపాడి, చోద్యం తదితర పది గ్రామాలకు వెళ్లేందుకు దగ్గర రహదారి ఏర్పాటు చేశారు. 1991 భారీ పెను తుపాన్‌కు కొండగెడ్డల నీటి ప్రవాహానికి అప్పటిలోనే ఈ కల్వర్టు కొట్టుకుపోయింది. ఆ తరువాత రెండేళ్లకు ఇదే గెడ్డపై రోడ్డు నిర్మించారు. మరో రెండేళ్లకు సగం కొట్టుకుపోయింది. ప్రస్తుతం ఇది శిథిలావస్థలో ఉంది. నిత్యం ఆటోలు, జీపులు, ద్విచక్ర వాహనాలతో రద్దీగా ఉండే ఈ రత్నంపేట -పాడి రోడ్డు ఉండేది. కల్వర్టు శిథిలం కావడంతో ఈ రూట్‌లో వాహనాల రాకపోకలు పదేళ్లుగా తగ్గాయి.

ఎన్నికల ముందు ప్రచారానికి వచ్చిన అన్నీ పార్టీల అభ్యర్థులు అధికారంలోకి వచ్చిన తక్షణమే రత్నపేట -పాడి రహదారి మధ్య శిథిలమైన కల్వర్టును పునర్నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. తీరా గెలిచా వారు పట్టించుకోలేదు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలపై గత నాలుగేళ్లుగా ప్రస్తుత ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎంపీ మాధవి పట్టించుకోలేదు. ఇప్పటికే అనేక దఫాలుగా విజ్ఞప్తి చేయటంతోపాటు, ఇటీవల “గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలోనూ ఆయా గ్రామాల ప్రజలు తెలియజేశారు. నాడు కూడా హామీ ఇచ్చిన ఎమ్మెల్యే నేటికీ దాని అమలుకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. వైసీపీ ప్రభుత్వం హయాంలోనైనా ఈ కల్వర్టుకు నిధుల మంజూరు అవుతాయని ఆశించారు. కాని తమ గ్రామల ప్రజల కష్టాలు ఏ ఒక్కరికి పట్టకపోవటం పట్ల పది గ్రామాల ప్రజలు పాడేరు ఎమ్మెల్యే, అరకు ఎంపీ పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాలకు ఏవారొచ్చిన గట్టిగా నిలదీస్తామని వారు అంటున్నారు. వచ్చే వర్షా కాలంలో వరదలొచ్చి కొట్టుకుపోతే తమ గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయని పది గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు గోడు వినిపించు కోవాలని, ఈ కల్వర్టును పునర్నిర్మించాలని పది గ్రామాల గిరిజనులంతా కోరుతున్నారు.

శిథిలావస్థలో ఉన్న రత్నంపేట-పాడి గ్రామాల మధ్య కల్వర్టు

కస్తూర్బా విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ

- గిరిజన సంఘం, కెవిపిఎస్ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-రోలుగుంట : గొలుగొండ మండలం చోద్యం కాలువలో అనుమానాస్పదంగా శవమై తేలిన రోలుగుంట కస్తూర్బా పాఠశాల 9వ తరగతి విద్యార్థి చిన్నారి మరణంపై సమగ్ర విచారణ చేపట్టి తగు చర్యలు చేపట్టాలని గిరిజన సంఘం, కెవిపిఎస్ నాయకులు ఈరెల్లి చిరంజీవి కోరారు. నాలుగు రోజుల క్రితం మృతి చెందిన రోలుగుంట కస్తూర్బా పాఠశాల విద్యార్థిని కుటుంబసభ్యులను గిరిజన సంఘం, కెవిపిఎస్ నాయకులు పరామర్శించారు. ఆడపిల్లలోని చిన్నారి కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బాలిక తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమార్తెకు జరిగిన అన్యాయం ఎవరికీ జరగకూడదని, దీనికోసమైనా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన సంఘం, కెవిపిఎస్ నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ అనుమానాస్పదంగా చనిపోయిన చిన్నారి మృతిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి న్యాయం చేయాలని, బాధిత కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బాలికలకు ఆత్మరక్షణ విద్యలో శిక్షణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థినులకు ఆత్మరక్షణ విద్యలో శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి నర్సీపట్నంలో శ్రీకారం చుట్టారు. రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో బండి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ సారథ్యంలో నర్సీపట్నం మండలంలో త్రైవాంగ్లో శిక్షణ ప్రారంభించారు. పెద్ద బొడ్డేపల్లి హైస్కూల్, బలిఘట్టం హైస్కూల్, నర్సీపట్నం తురకబడి హైస్కూల్లో శిక్షణ ప్రారంభించారు. బాలికలకు ఆత్మరక్షణకు బాక్సింగ్, త్రైవాంగ్లో పతకాలు సాధించిన బొంతు మౌనిక, వేపాడ ప్రియాంక ఆధ్వర్యంలో బాలికలకు శిక్షణ కొనసాగుతుంది. మండలంలోని 20 హైస్కూల్లో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని శాప్ కోచ్ అబ్బు తెలిపారు. పెద్ద బొడ్డేపల్లి హైస్కూల్లో పేరెంట్స్ కమిటీ చైర్మన్ బేతిరెడ్డి విజయ్కుమార్ శిక్షణను ప్రారంభించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉబిడి అప్పారావు, వ్యాయామ ఉపాధ్యాయుడు బల్లబ్బాయి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్పర్సన్ రాజీనామా

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం మున్సిపాలిటీ చైర్పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి ఎట్టకేలకు తన పదవికి రాజీనామా చేశారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్ పదవులను వంతులవారీగా చేపట్టాలని వైసిపి పెద్దమనుషుల సమక్షంలో కుదిరిన ఒప్పందం మేరకు తాజా రాజీనామా చేసినట్లు సమాచారం. మంగళవారం మున్సిపల్ చైర్పర్సన్ ఆదిలక్ష్మి రాజీనామా పత్రాన్ని ఆమె అన్నయ్య గుడబండి నాగేశ్వరరావు తీసుకెళ్లి, ముందుగా స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్గణేష్కు చూపించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కనకారావుకు రాజీనామా పత్రాన్ని అందించి, ఆమోదించాలని కోరారు. సోమవారం మున్సిపల్ వైస్చైర్మన్ తన పదవికి రాజీనామా చేయగా, ఇపుడు చైర్పర్సన్ ఆదిలక్ష్మి కూడా రాజీనామా పత్రాన్ని సమర్పించడంతో జిల్లాల మున్సిపాలిటీలో జరుగుతున్న ప్రచారానికి తెరపడింది. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే మాట శిరోధార్యమని, ఇప్పటివరకు తనకు సహకరించిన పెద్దలు, మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తమరాన నాయుడు, గుడబండి నాగేశ్వరరావు, మాకిరెడ్డి బుల్లిదొర, వీరమాచినేని జగదీష్ తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్పర్సన్, వైస్చైర్మన్ ఇద్దరూ రాజీనామాలు సమర్పించడంతో వాటిని ఆమోదిస్తే కొద్దిరోజులు ప్రత్యేకాధికారి పాలనలో మున్సిపాలిటీ నడవనుంది. ఆ తర్వాత చైర్ పర్సన్గా బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్గా కోనేటి రామకృష్ణ ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉందని వైసిపి వర్గాలు అంటున్నాయి.

వివాదాస్పద భూమిలో లే-అవుట్ పనులు నిలిపివేత

ప్రజాశక్తి - గొలుగొండ : ఆర్డిఓ కోర్టులో వివాదంలో ఉన్న భూమిలో లేఅవుట్ కోసం చదును చేస్తున్న పనులను గొలుగొండ రెవెన్యూ, పోలీస్ అధికారులు మంగళవారం నిలిపివేశారు. గొలుగొండ రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 490లో 3.63 ఎకరాల భూమి కోసం చేల వెంకయ్యమ్మ వారసులు కొన్నేళ్లుగా గొడవ పడుతున్నారు. రెండేళ్లుగా ఈ భూమి వివాదం నర్సీపట్నం ఆర్డిఓ కోర్టులో నడుస్తోంది. అయితే వారసుల్లో ఒక వర్గానికి చెందిన వారు కోర్టులో వివాదం ఉన్నప్పటికీ భూమిని అమ్మకానికి పెట్టి, రెండు రోజులుగా లేఅవుట్ కోసం సిద్ధం చేస్తున్నారు. ఈ విషయాన్ని గమనించిన రెండో వర్గం వారు పనులను అడ్డగించి స్థానిక సర్పంచ్ కొసిరెడ్డి అప్పారావు సహకారంతో పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసు రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పనులను నిలిపివేసి వాహనాలను పంపించివేశారు. కోర్టులో వివాదం తేలిన తర్వాతే భూమిలో పనులు చేపట్టాలని, అప్పటివరకు రెండు వర్గాల వారు భూమిలోనికి అడుగుపెట్టడానికి వీలులేదని అధికారులు హెచ్చరించారు.

ప్రైవేటు ఎలక్ట్రీషియన్ల గుర్తింపునకు సమగ్ర సర్వే

అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శుల వెల్లడి

ప్రజాశక్తి -పాడేరు: రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలో మండలాల వారీగా ప్రైవేట్ విద్యుత్ కార్మికులు, ప్లంబర్స్ గుర్తింపు కోసం యూనియన్ ఆధ్వర్యంలో సమగ్ర సర్వే యాత్ర-2 చేపట్టినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు దనేకుల వెంకటసత్యనారాయణ, శ్రీహరి రావు వెల్లడించారు. మంగళవారం అల్లూరి జిల్లాలోని పాడేరు డివిజన్లో సర్వే ప్రారంభించిన సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల మందికిపైగా ప్రైవేటు ఎలక్ట్రీషియన్లు ప్లంబర్లు ఉన్నారని, యూనియన్ ద్వారా వారి సంక్షేమానికి కృషి చేయనున్నట్లు వెల్లడించారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా మూడేళ్లుగా నిలిపేసిన కార్మికసంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని కోరారు. ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికుల వృత్తి పరికరాల కొనుగోలుకు రూ.రెండు లక్షల సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, విధుల్లో ఉండగా ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వపరంగా రూ.పది లక్షల పరిహారం చెల్లించాలని, ఎలక్ట్రీషియన్ డేను ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతిమండలంలోనూ ఎలక్ట్రికల్ సర్వీస్ సెంటర్స్ ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

రాష్ట్ర ప్రచారకమిటీ సభ్యులు కొట్టగుల్లి రామారావు మాట్లాడుతూ జిల్లాలోని పాడేరు డివిజన్లోని అరకు అనంతగిరి, డుంబ్రిగూడ, పెదబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట, పాడేరు మండలాల్లో సర్వే యాత్ర పూర్తయిందని, మిగిలిన మండలాలతోపాటు రంపచోడవరం డివిజన్లోని మండలాల్లోనూ సర్వే నిర్వహిస్తామన్నారు. సర్వే పూర్తయ్యాక జిల్లా స్థాయిలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బి.మాదన్న, ఉపాధ్యక్షులు కె.పోలరాజ్, కన్వీనర్ వెంకటరమణ ,అల్లూరి జిల్లా అధ్యక్షులు కిల్లోయి కృష్ణబాబు పాడేరు హుకుంపేట అరకు ముంచంగిపుట్టు పెదబయలు మండలాల అధ్యక్షులు బబ్లు, కిషోర్, గోవింద్, శంకరరావు, గోవర్ధన్, కోట సన్యాసిరావు పాల్గొన్నారు.

కేబుల్ గోతులతో కష్టాలు

పూర్తిస్థాయిలో పూడ్చకపోవడంతో ప్రమాదాలకు ఆస్కారం

రోడ్డు అంచుల వెంబడి తవ్విన ఒఎఫ్సి గోతులు

ప్రజాశక్తి -జి-మాడుగుల : సెల్ టవర్ ఏర్పాటుతో ఫోను సేవలు అందుబాటులోకి వస్తున్నందు ఆనందం ఒకవైపుంటే, ఇదే సమయంలో టవర్లకు అనుసంధానించే అండర్గ్రౌండ్ కేబుల్ ఏర్పాటు పనుల్లో నిర్లక్ష్యంపై మన్యవాసులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని బొయితిలి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు జరుగుతున్న సెల్టవర్ నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డుపక్కన అండర్ గ్రౌండ్ కేబుల్ ఏర్పాటుకు తవ్విన గోతులను పూర్తిస్థాయిలో సమతలంగా పూడ్చకపోవడం, ఇటీవల కురుస్తున్న వర్షాలకు కేబుల్ గోతులు కుంగిపోవడంతో ఆ మార్గంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడక తప్పడం లేదని స్థానిక సర్పంచ్ లంగాని మాలన్న ఆవేదన వ్యక్తం చేశారు. అండర్ గ్రౌండ్ కేబుల్స్ రోడ్డుకు కొంచం దూరంలోనైనా కాకుండా ఏకంగా రోడ్డు అంచుల్లోనే ఏర్పాటు చేయడం, వాటిని పూర్తిస్థాయిలో పూడ్చకపోవడం వల్ల ప్రమాదాలకు ఆస్కారమేర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టి, ప్రమాదాలకు తావులేకుండా చూడాలని మన్యవాసులు కోరుతున్నారు.

ఆదివాసీలకు అన్యాయం జరగనివ్వం

ఆసరా చెక్కు పంపిణీలో ఎమ్మెల్యే ఫాల్గుణ

ప్రజాశక్తి డుంబ్రిగూడ: బోయ/వాల్మీకులను ఎస్టి జాబితాలో చేర్పించినా, ఆదివాసీలకు ఎటువంటి అన్యాయం జరగనివ్వబోనని ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి హామీనిచ్చినట్లు స్థానిక ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అల్లూరి గ్రౌండ్లో వెలుగు ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు మూడో విడత ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 414 డ్వాక్రా సంఘాల్లోని 4584 మంది సభ్యులకు మూడవ విడత ఆసరాలో రూ.కోటి 20 లక్షల 22 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఫాల్గుణ మాట్లాడుతూ బోయ/వాల్మీకి రిజర్వేషన్లతో ఆదివాసీలకు ఎటువంటి అన్యాయం జరిగినా, తానూ వారితో కలిసి ఆందోళనల్లో పాల్గొంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ఈశ్వరి, జెడ్పిటిసి సిహెచ్ జానకమ్మ, వైస్ ఎంపిపిలు ఎస్ ఆనంద్, లలిత, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ ఎస్ కృష్ణారావు, ఎపిఎం శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షుడు ఎస్ గోపాల్, వైసిపి నాయకులు బి సింహాచలం, సిహెచ్ కృష్ణారావు, మాజీ జెడ్పిటిసి ఎన్ శ్రీరాములు, సీసీలు, విఎఒలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

నేరాలు ఘోరాలు

పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

పలు చోట్ల గంజాయి పట్టివేత

పలువురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - జి మాడుగుల : 35 కిలోల గంజాయితో ఐదుగురు నిందితులను పట్టుకుని అరెస్ట్ చేసినట్టు జిమాడుగుల ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు మండలంలో గల కే కోడాపల్లి పంచాయతీ, బందవీధి గ్రామ జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలునిర్వహిస్తుండగా, అటుగా ప్రయాణికులతో వస్తున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా అందులో 35 కిలోల ఎండు గంజాయి పట్టుబడింది. గంజాయి రవాణా చేస్తున్న తెలంగాణకు చెందిన శ్రీకాంత్, శివకృష్ణలను అదుపులోకి తీసుకుని విచారించగా, తమతోపాటు మరో ముగ్గురు ఉన్నారని పోలీసులకు తెలిపారు. వారి సమాచారం మేరకు పాడేరు గ్రామానికి చెందిన నగ దిలీప్, హుకుంపేట గ్రామానికి చెందిన లలిత్, అప్పలరాజులను అదుపులోకి తీసుకుని, మొత్తం ఐదుగురున నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, శివ సత్యనారాయణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు : ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న ఆరు కేజీల గంజాయిని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... చింతూరు పోలీసులు మంగళవారం పోలీస్ స్టేషన్ ఎదురుగా వాహనాలు తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా అటుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, ఆరు కేజీలు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వాహనంపై గంజాయి తరలిస్తున్న కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన కోట జగదీష్, పశ్చిమగోదావరి జిల్లా పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామానికి చెందిన కాకి గౌతమ్ జోష్, పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకి చెందిన కాకర్ల పద్మభూషణ్ అనే వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుండి ఆరు కేజీల గంజాయి, ద్విచక్ర వాహనం, ఒక సెల్ ఫోను స్వాధీనం చేసుకున్నారు. వీరికి గంజాయి విక్రయించిన మరో వ్యక్తి పరారీలో ఉన్నారు. నిందితులు జిల్లాలోని దారకొండ నుండి విజయవాడ గంజాయి తరలిస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించినట్లు చెప్పారు.

రాజవొమ్మంగి : మండలంలోని జడ్డంగి పోలీస్ స్టేషన్ పరిధిలో గత ఏడాది డిసెంబర్ 22న నమోదైన గంజాయి కేసులో ఒక వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు రాజవొమ్మంగి సీఐ షేక్ బాజీ లాల్, జడ్డంగి ఎస్ఐ షరీఫ్ తెలిపారు, జిల్లాలోని చింతపల్లి మండలం, నిమ్మలపాడు గ్రామానికి చెందిన గెమ్మెల కేశవరావు 2022 డిసెంబర్ 22న గంజాయి తరలిస్తున్న కేసులో నిందితుడు, అప్పటినుండి పరారీలో ఉన్న నిందితుడు. నాడు కేశవరావుపై కేసు నమోదు కాగా, మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు వారు వెల్లడించారు.

చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ప్రజాశక్తి- నక్కపల్లి : చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని వాడుకలోకి తీసుకొచ్చి బంగారమ్మపేటను చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని ఎంపిడిఒ సీతారామరాజు సూచించారు. మంగళవారం ఇఒపిఆర్డి వెంకటనారాయణతో కలిసి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు .త్వరతగతిన పనులు పూర్తి చేసి వాడుకలోకి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శి నరసింహారావుకు సూచించారు. నిర్మాణ దశలో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించారు. వేగంగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వృద్ధులు, వికలాంగులకు ఆహారం అందిస్తున్న జాన్ వెస్లీ

ఘనంగా జాన్ వెస్లీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మనం కోరుకునే ఆనందం, సౌకర్యాలు ఇతరులకూ ఉండాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ అన్నారు. మంగళవారం గోకుల్ థియేటర్ సమీపంలో జివిఎంసి నిర్వహిస్తున్న అనాథ, వికలాంగుల ఆశ్రమంలో ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎపిఐఐసి స్టేట్ డైరెక్టర్ అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వృద్ధులకు, వికలాంగులకు అల్పాహారం, పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కనకల ఈశ్వర్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల భరత్, వైసిపి నగర కార్యదర్శి ముత్తాబత్తుల రమేష్, అరగల రాజు, పెద్దాడ తేజ పాల్గొన్నారు.

ఘనంగా కరకచెట్టు పోలమాంబ ఉత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 14 గ్రామాల ఆరాధ్య దైవంగా పేరొందిన పెదవాల్తేరులోని శ్రీశ్రీశ్రీ కరకచెట్టు పోలమాంబ అమ్మవారి ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సురేష్ బాబా, చైర్మన్ పి.శంకర్ రెడ్డి వారికి సాదర స్వాగతం పలికారు. కార్యక్రమంలో ధర్మకర్తలు మంగరాజు, నైటమ్మ , కృష్ణమోహన్, నాగమణి, భారతి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద పాల్గొన్నారు.

పిల్లలకు పాల సరఫరా ప్రారంభం

ఉత్సవాల్లో భాగంగా చంటి పిల్లల సౌకర్యార్థం ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద పిల్లలకు వేడి పాలు, బిస్కెట్లు పంపిణీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ప్రారంభించారు. తల్లి పాలు అందించే ప్రత్యేక గదులను, మెడికల్ క్యాంప్ను, ప్రత్యేక అంబులెన్స్ను పరిశీలించారు. ఏర్పాట్లుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

పండగను బహిష్కరించిన మద్ది కుటుంబీకులు

తరతరాలుగా అమ్మవారి సేవలో ఉన్న మద్ది వారి కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయడం తగదని మద్ది వారి కుటుంబ సభ్యుల సంఘం సలహాదారుడు మద్ది శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం పెదవాల్తేరు బజార్ వద్దనున్న మద్దివారి పెద్దిల్లు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలమాంబ జాతర ఉత్సవాలకు ప్రతి ఏటా తమ మద్ది వారి కుటుంబాలకు 120 వరకు దర్శన పాసులు ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం పాస్లు ఇవ్వలేదన్నారు. కొత్తగా వచ్చిన దేవస్థాన ధర్మకర్తల మండలి పాత సాంప్రదాయాలను, పద్ధతులను తుంగలోకి తొక్కడం గర్హనీయమన్నారు.

733వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్ప్లాంట్ను ప్రైవేటీకరణ చేస్తే రిజర్వేషన్లను కోల్పోవలసి ఉంటుందని, అదే జరిగితే ఎస్సీ, ఎస్టీ, బీసీ తరగతుల వారికి ఉపాధి లేకుండా పోతుందని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షుడు టి.నూకరాజు అన్నారు. స్టీల్ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు మంగళవారానికి 733వ రోజుకు చేరాయి. దీక్షలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, ఇ.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విశాఖకు చంద్రబాబు

ఉత్తరాంధ్ర జిల్లాల నేతలతో సమీక్షా సమావేశం
11 అంశాలపై అజెండాల వారీగా చర్చ

టిడిపి సమావేశం జరిగే వి.కన్వెన్షన్ సెంటర్ ఇదే..

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

తెలుగుదేశం పార్టీ ఉత్తరాంధ్ర నుంచి సమీక్షా సమావేశాలకు తెర తీసింది. జోన్-1 అంటే ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకూ పిఎం.పాలెంలోని వి.కన్వెన్షన్ హాల్లో పార్టీ సమావేశాన్ని నిర్వహిస్తోంది. పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు ఈ సమావేశంలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభోపన్యాసం చేయనున్నారు. దాదాపు రాత్రి వరకూ ఈ సమావేశం కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉదయం 10 నుంచి 11 గంటల వరకూ ప్రతినిధుల నమోదు, ఆ తర్వాత వేదికపైకి అతిథుల ఆహ్వానం, ఎన్టిఆర్కి నివాళి, తెలుగుతల్లి గీతాలాపన ఉంటాయి. అనంతరం 11 నుంచి 11.20 మధ్య రాష్ట్ర అధ్యక్షులు, జోన్ ఇన్ఛార్జ్ ఉపన్యాసం ఉంటాయి. 11.20 నుంచి 11.30 గంటల వరకూ టెలిగ్రామ్ బాట్ ద్వారా హాజరు నమోదుపై చింతకాయల విజయ్ శిక్షణ ఇస్తారు. 11.30 గంటల నుంచి 11.45 వరకూ ఆర్టిఎస్ కార్యక్రమంపై టీం సభ్యుల శిక్షణ ఉంటుంది. 11.45 నుంచి 12 గంటల వరకూ ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియపై ఎస్.రాజశేఖర్ అవగాహన కల్పిస్తారు. 12 నుంచి 12.10 గంటల వరకూ కుటుంబ సాధికార వారధి నియామక ప్రక్రియపై అవగాహనా కార్యక్రమం ఉంటుంది. 12.10 నుంచి 12.30 గంటల వరకూ వైసిపి మోసకారి సంక్షేమంపై నాలెడ్జ్ సెంటర్ చైర్మన్ గురజాల మాల్యాద్రి ప్రజెంటేషన్ ఉంటుంది. 12.30 నుంచి 12.40 వరకూ కార్యకర్తల సంక్షేమం, న్యూట్రిఫుల్ యాప్పై శిష్టా లోహిత అవగాహన కల్పిస్తారు. 12.40 నుంచి 12.50 వరకూ సామాజిక మాధ్యమాలు, వాట్సాప్ గ్రూపుల నిర్వహణపై చింతకాయల విజయ్, మధ్యాహ్నం 12.50 నుంచి ఒంటి గంట వరకూ అక్రమ అరెస్టులు, కేసులు ఎదుర్కోవడంపై న్యాయ విభాగం నుంచి పిఎస్.నాయుడు ప్రజెంటేషన్ ఇస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకూ భోజన విరామం ఉంటుంది. అనంతరం 2 నుంచి 2.40 గంటల వరకూ చంద్రబాబు ప్రారంభోపన్యాసం చేస్తారు. 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' అంశంపై 2.40 గంటల నుంచి 3 గంటల వరకూ జోనల్ స్థాయిలో సమీక్ష, మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.40 గంటల వరకూ పార్లమెంటుల వారీ సమీక్షలు ఉంటాయి. సాయంత్రం 4.40 నుంచి 5 గంటల వరకూ చంద్రబాబు ముగింపు ప్రసంగం ఉంటుంది. ఉత్తరాంధ్ర సమావేశం నేపథ్యంలో ఇప్పటికే వి.కన్వెన్షన్ హాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి.

అప్పన్న చందనోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, సింహాచలం

ఈ నెల 23న జరిగే సింహాచల అప్పన్న నిజరూప దర్శనం చందనోత్సవ యాత్రకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, దేవాదాయ శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో చందనోత్సవ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23న తెల్లవారుజాము మూడు గంటలకు సింహాచల చందనోత్సవ మొదటి దర్శనం ప్రారంభమవుతుందని తెలిపారు. భక్తులందరికీ సంతృప్తిగా దర్శనం కలిగేలా ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. వేలాది సంఖ్యలో భక్తులు సింహగిరికి రానున్నారని, ఈ నేపథ్యంలో సామాన్య భక్తులు ఎటువంటి ఇబ్బందులకూ గురికాకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అందరికీ సరిపడేలా ప్రసాదాలు తయారు చేయాలని పేర్కొన్నారు. సిబ్బందికి కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. వికలాంగులకు, వృద్ధులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయాలన్నారు. వాహనాలు, లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ భక్తులకు 24 గంటలూ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని అన్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ హరి జవహర్ లాల్ మాట్లాడుతూ టిక్కెట్ల విక్రయం, దర్శన సౌకర్యం కోసం ప్రత్యేక సాఫ్ట్వేర్ రూపొందించినట్లు తెలిపారు. భక్తులు, అధికారులు కోవిడ్ నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ చందనోత్సవం జరిగే రోజున మాంసం దుకాణాలు, మద్యపాన దుకాణాలు మూసివేయాలన్నారు. భక్తులకు ఉచిత దర్శనంతో పాటు రూ.300, రూ.1000, రూ.1500 టిక్కెట్లను విక్రయించనున్నట్లు తెలిపారు. పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ మాట్లాడుతూ భక్తులకు అసౌకర్యం కలగకుండా స్లాట్ సిస్టం ద్వారా దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, డిసిపి సుమిత్ సునీల్ గరుడ్, ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దేవాదాయ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీస్, ఆర్టిసి, వైద్య ఆరోగ్య, ఫైర్, జివిఎంసి శాఖల అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి -పాడేరు : జిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఎపియుడబ్ల్యుజె జాతీయ కౌన్సిల్ సభ్యులు బూసిన నాగరాజు కోరారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్లో డిఆర్ఒను పాడేరు డివిజన్లోని యూనియన్ జర్నలిస్టులు కలిసి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు గత డిసెంబరు నెలాఖరుతో ముగియగా, మూడు నెలలు రెన్యువల్ చేసిందని, ఆ గడువు ముగిసిన తర్వాత ఇపుడు అక్రిడిటేషన్లు, బస్పాస్లు రెన్యువల్ చేయకుండా ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. కొత్త అక్రిడిటేషన్ల జారీకి జాప్యం జరిగే పరిస్థితులున్నందున తక్షణమే రెన్యువల్ చేసి, తర్వాత కొత్త అక్రిడిటేషన్ జారీకి చర్యలు చేపట్టాలని కోరారు. అక్రిడిటేషన్ కమిటీలో యూనియన్లకు ప్రాతినిధ్యం కల్పించాలని, మండలానికి వంద పత్రికల నిబంధన తొలగించాలని, కాలంగా పెండింగ్లో ఉన్న వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ అమలు చేయాలని, ఇటీవల జారీచేసిన జిఒలో అసంబద్ధ నిబంధనలను తొలగించి, కొత్త జిఒ జారీ చేయాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలు, ప్రయోజనాల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యధోరణితో వ్యవహరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు ఎం.గురునాథ్,శ్రీనివాసరావు, హరి తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడులను మర్యాదపూర్వకంగా కలిసి, వారిని సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రావాడ సత్యనారాయణ, సెక్రెటరీ లోకా లోవరాజు, వైస్ ప్రెసిడెంట్ సూరిబాబు, ట్రెజరర్ గోవర్ధన్ గిరి, జాయింట్ సెక్రెటరీ వెంకట రమణ, లైబ్రరీ ప్రతినిధి గోవింద్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు భగీరథరావు, జూనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు సయ్యద్ వలీ, స్పోర్ట్స్, కల్చరల్ ప్రతినిధి ఎన్.కృష్ణ, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు

'వైసిపి కార్పొరేటర్ సురేష్ నుంచి ప్రాణ హాని'

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి 60వ వార్డు వైసిపి కార్పొరేటర్ పివి.సురేష్ నుంచి తనకు, తన కుటుంబ సభ్యులకూ ప్రాణహాని ఉందని మల్కాపురానికి చెందిన ములగాడ కనకరాజు ఆరోపించారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను 30 సంవత్సరాలుగా శ్రీహరిపురంలోని గాంధీ మార్కెట్ చింతచెట్టు వద్ద చెప్పులు, బ్యాగులు కుట్టుకొని జీవనం సాగిస్తున్నట్టు తెలిపారు. అక్కడ తాను జై భీమ్ బ్యాగ్ వర్క్స్ పేరిట బ్యానర్ను ఏర్పాటు చేసుకోగా సురేష్ ఆ బ్యానర్పై తన పేరు రాసి పెట్టాలని డిమాండ్ చేశారన్నారు. దానికి తాను అంగీకరించకపోవడంతో మార్చి 29 రాత్రి సచివాలయ సిబ్బంది పేరుతో కొంతమంది ప్రొక్లైన్తో వచ్చి తాను అక్కడ లేని సమయంలో తన దుకాణాన్ని తొలగించారని తెలిపారు. తనకు ఎటువంటి నోటీసూ ఇవ్వకుండా.. ఇలా తన జీవనోపాధిని దెబ్బకొట్టడం దారుణమన్నారు.

రేషన్ పంపిణీలో పొరపాట్లు జరిగితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చౌక ధరల దుకాణాలు, ఇంటింటికీ రేషన్ పంపిణీ వాహనాలలో సరుకుల పంపిణీలో పొరపాట్లు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు అన్నారు. మంగళవారం సాయంత్రం సివిల్ సప్లై, ఐసిడిఎస్ అధికారులతో కలిసి ఆయన నగరంలోని పలు రేషన్ డిపోలను, రేషన్ పంపిణీ వాహనాలను, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా శివాజీపాలెం ఏరియాలోగల డిపో నెంబర్ 567, 203ను తనిఖీ చేశారు. బియ్యం స్టాక్ ఎంత వచ్చింది, ఎంత పంపిణీ చేశారు, ఎంతమంది కార్డుదారులు ఉన్నారు, రైస్ కార్డు ఎన్ని ఉన్నాయి.. తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రేషన్ పంపిణీ వాహనం నెంబర్ 31ని తనిఖీ చేసి స్టాక్ సరిగా లేనందున అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిఎస్ఒ సూర్యప్రకాష్రావు, ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరి పాల్గొన్నారు.

ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం

ప్రజాశక్తి- నక్కపల్లి : ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను త్వరతగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒ సీతారామరాజు అన్నారు. మంగళవారం మండలంలోని డిఎల్ పురం సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, అంగన్వాడీలతో సమావేశం నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులకు ఇకెవైసి నమోదు చేయాలని సూచించారు. ఈ సర్వీసెస్, ఈ సర్వీసెస్ నగదు జమ చేయుట, స్కిల్ డెవలప్మెంట్ యాప్ డౌన్లోడ్ సంబంధించిన అంశాలపై సమీక్షించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందించే సేవలు సకాలంలో అందించాలన్నారు.